క్లుప్తంగా

ముందస్తు టీకాలు శుభపరిణామం



శాంతినగర్: పశువుల్లో గర్భస్రావాలు జరగకుండా ముందస్తు టీకాలు వేయడం శుభపరిణామమని కొంకల సర్పంచ్ వరలక్ష్మి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల, వెంకట్రామనగర్ గ్రామాల్లో పశు వైద్యశాల ఆధ్వర్యంలో 8 నెలల్లోపు ఆవు, గేదె దూడలకు ఆదివారం బ్రుసెల్లోసిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి రైతు దూడలకు టీకాలు వేయించి పాడిపశువులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, ఎల్‌ఎస్‌ఏ లతీఫ్, వీఏ ప్రభాకర్, ఓఎస్ రవి, కృష్ణ, వెంకటమ్మ, గోపాల మిత్ర నారాయణగౌడ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుక ఎల్లమ్మ జాతర

రాజోళి: మండలంలోని తుమ్మిళ్లలో సోమవారం నుంచి రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ జాతర ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, వివిధ పోటీలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు, పొట్టేళ్ల పందెం, కబడ్డీ పోటీలు జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొదటిరోజు సాయంత్రం చల్ల కడువ, ప్రభ కార్యక్రమం, పరుశరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జాతరను పురస్కరంచుకుని గ్రామంలో ఆడపడుచుల సందడి నెలకొంది. పలు వీధులలో స్వాగత తోరణాలు కట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

సీఎం కేసీఆర్‌తో నాందేడ్‌కు చల్లా



అలంపూర్: సీఎం కేసీఆర్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి నాందేడ్‌కు వెళ్లినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. బీఆర్‌ఎస్ దేశ వ్యాప్తంగా విస్తరణలో భాగంగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు సీఎం కేసీఆర్‌తోపాటు చల్లా ప్రత్యేక విమానంలో నాందేడ్‌కు బయలుదేరి వెళ్లారు.

నేడు హాత్ సే హాత్ జోడో యాత్ర

అలంపూర్: ఈ నెల 6వ తేదీన కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభం అవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అలంపూర్ మండలం నుంచి ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ సంపత్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు అలంపూర్ క్షేత్రంలో జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గొందిమల్లలో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

50 వసంతాల చదువులమ్మ చెట్టు నీడలో...



గద్వాల: ఎంఏఎల్‌డీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972–74లో ఇంటర్మీడియేట్ పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పటి కళాశాల అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించి, ఆ నాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఆనందంగా గడిపారు. మిత్రమా.. క్షేమమా అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. వృత్తులు, వ్యాపకాలు, కుటుంబ నేపథ్యం, పిల్లల చదువులు, బాగోగుల గురించి పరస్పరం తెలుసుకున్నారు. కళాశాల మొత్తం కలియ తిరిగారు. చిరకాల మిత్రులు కలిసిన ఆనందం వారిలో కొత్త అనుభూతులు పంచిందని పలువురు పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండి ఇప్పటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కరాటేలో పుల్లూరు విద్యార్థినికి గోల్డ్ మెడల్

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన వైష్ణవి వరంగల్‌లో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్–2023లో గోల్డ్ మెడల్ సాధించింది. బంగారు పతకం సాధించడంతో ఆదివారం విద్యార్థినిని గ్రామస్తులు అభినందించారు.

ఇలవేల్పు తిక్కవీరేశ్వరస్వామి

- 8 నుంచి బ్రహ్మోత్సవాలు
- 10న స్వామివారి రథోత్సవం



తిక్క వీరేశ్వరస్వామి విగ్రహం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

అయిజ: పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 10 రోజుల పాటు వైభవంగా నిర్వహించే తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. ప్రతి రోజు ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేదపండితులు ఆలయంలో నిర్వహించే శాంతి హోమం, పూజా కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొంటారు.

ఆలయ చరిత్ర..

సుమారు 400 సంవత్సరాల కిందట 6 అడుగుల ఆజానుబాహుడు ఒక సాధువు రూపంలో అయిజ (అప్పుడు అయిజ పురంగా పిలువబడేది) లో కలియ తిరిగేవాడు. జడలు కట్టిన జుట్టు, పొడవాటి గడ్డం, ఒల్లంతా వీభూదితో ఉన్న సాధువు తనలో తానే నవ్వుకుంటూ తిరిగేవాడు. అతన్ని చూసి ప్రజలు పిచ్చివాడని అనుకునేవారు. మెడకు పాములు చుట్టుకొని తిరుగుతుండడంతో చూసిన వారంతా భయభ్రాంతులకు గురయ్యేవారు. ఒకరోజు సాధువు కుష్టి రోగిని తాకడంతో అతను మామూలు మనిషిగా మారాడు. సాధువు మామూలు మనిషి కాదని దైవ శక్తులు ఉన్నాయని స్థానికులు భావించారు. వేపచెట్టు కింది 101 రోజు కఠోరమైన దీక్షచేసి ఆకాశంనుంచి శివలింగాన్ని రప్పించి అక్కడ ప్రతిష్ఠించాడని, అనంతరం స్వామి జీవసమాధి అయ్యాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఆ సాధువు పరమేశ్వరుడికి ప్రతిరూపమని తలచి అక్కడ ఆలయం నిర్మించి, ఆలయంలో తిక్క వీరేశ్వరస్వామి రూపంలో ఉన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి, భక్తులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఉత్సవాల కార్యక్రమాలు

ఈ నెల 8 నుంచి 18వ వరకు అయిజ పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి జాతర సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 8న స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అర్చకుడి నివాసంనుంచి ఆలయంవరకు ఊరేగిస్తారు. రాత్రి కలశ స్థాపన, చట్టసేవ నిర్వహిస్తారు. అదేవిధంగా 9న శాంతి హోమం, రాత్రి ప్రభోత్సవం, 10న రాత్రి రథోత్సవం కన్నుల పండువగా జరుపుతారు. 11న సందరాళ్ల, దొబ్బడ గుండు, గుబ్బ గుండు, ఇసుక సంచి పోటీలు ఏర్పాటు చేశారు. 12న అంతర్రాష్ట్ర భజన పోటీలు, అదేవిధంగా శునకముల పరుగు పోటీలు, 13 నుంచి 16 వరకు మండల స్థాయి డ్యాన్స్ కాంపిటీషన్, 13వ తేదీ ఒంటెద్దుతో రెండు బండ్ల గిరక పోటీలు, 14న అంతర్రాష్ట్ర స్థాయి పొటేళ్ల బల ప్రదర్శన, అదేవిధంగా రైతు సంబరాల్లో భాగంగా 15న పాలపళ్ల వృషభరాజుల బల ప్రదర్శన, 16న సేద్యపు ఎద్దుల బల ప్రదర్శన, 17న సీనియర్స్ విభాగం వృషభరాజుల బల ప్రదర్శన నిర్వహించనున్నారు. 18న మహాశివరాత్రి సందర్భంగా టిక్ టాక్, శ్రీదేవి డ్రామా కంపెనీ జబర్దస్త్ ఫేమ్ బృందంతో ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా రంగుల రాట్నాలు, మిఠాయి దుకాణాలు ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

భట్టిని కలిసిన వాల్మీకి నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, వాల్మీకులు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ ఎమ్మెల్యే, సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్కను జిల్లా వాల్మీకి బోయ కులస్తులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో కలిశారు. ఈసందర్భంగా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలనే అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోరావాలని కోరారు. ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టే విధంగా కృషి చేయాలని విన్నవించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

గద్వాల అర్బన్: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత నెల 30 నుంచి రాజీవ్ గాంధీ స్మారక ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–2 నిర్వహించగా ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సంపత్ కుమార్ హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు.

విజేతగా శ్రీసామ్య జట్టు

ఫైనల్‌లో శ్రీసామ్య జట్టు, గద్వాల క్రికెట్ క్లబ్ జట్లు తలబడ్డాయి. గద్వాల క్రికెట్ క్లబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. అనంతరం 149 లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీసామ్య జట్టు 16.5ఓవర్లలో 150 పరుగులు చేసి విన్నర్‌గా నిలిచింది. విన్నర్‌గా నిలిచిన శ్రీ సామ్య జట్టుకు రూ. 50,016 నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన గద్వాల క్రికెట్ క్లబ్ జట్టుకు రూ. 25,016 నగదుతో పాటు ట్రోఫీని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు గౌస్, నాయకులు ఇసాక్, వీరేష్, ఇలియాస్, నందు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి వీధి సమావేశాలు

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని పట్టణాల్లో, గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు వీధి సమావేశాలు నిర్వహించాలని నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ కార్యర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు వీధి సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు.

సమాజ సేవలో ముందుండాలి



సురవరం సుధాకర్ రెడ్డిని సన్మానిస్తున్న కుటుంబసభ్యులు

ఉండవెల్లి: సమాజ సేవలో అందరూ ముందుండాలని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కంచుపాడులో సురవరం విజ్ఞాన కేంద్రంలో సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం కుటుంబంలో సురవరం ప్రతాప్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, అనేక పోరాటాలు చేసి ఆదర్శంగా నిలిచాలన్నారు. కార్యక్రమంలో డా. పుష్పలత, డా. కృష్ణవర్ధన్ రెడ్డి, అగ్రికల్చర్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ రఘువర్ధన్ రెడ్డి, రామచంద్రయ్య, సీపీఐ నాయకులు కర్నూల్, కల్కురి, రామచంద్రారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ నాయకులు విజయ లక్ష్మి, కపిల్, నివేదిత, తదితరులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం కల్పించాలి

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తక్కశిలలో ఆ పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆదివారం తక్కశీల గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తక్కశిల, ప్రాగటూరు, శేరుపల్లె గ్రామాలకు రోడ్డు మార్గాలు ఉన్నా రవాణా సౌకర్యం లేదని విమర్శించారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు దాదాపు 5 కి.మీ మేర నడుచుకుంటు పాఠశాలలకు వెళ్తున్నారని వాపోయారు. సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్ర యాదవ్, రాజగోపాల్ రెడ్డి, పటేల్ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్, మహేందర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే ముఖ్యం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిసరాల స్వచ్ఛతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో చెరువు, బస్టాండ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు ప్లాస్టిక్, వ్యర్థాలు, బట్టలు, సీసాలు, చెత్తను తొలగించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



అయిజలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అయిజ: మండలంలోని వివిధ ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. అదేవిధంగా పట్టణంలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణంను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మండలంలోని గుంటిరంగనాథ స్వామి ఆలయంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించి రాత్రి రథోత్సవం కనులవిందుగా జరిగింది. మండలంలోని ఉప్పలలో వేణుగోపాలస్వామికి అభిషేకం, జమదగ్ని జంబులేశ్వరి కల్యాణం నిర్వహించారు. రాత్రి రథోత్సవం వైభవంగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిలో సేవలో తరించారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని పటిష్టం చేద్దాం



నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గట్టు: క్షేత్రస్థాయిలో బీజేపీని పటిష్టం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాయపురంలో 93, 94 బూత్ స్థాయి పర్యవేక్షకులు, కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. బూత్ స్థాయి కమిటీ సభ్యులను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బూత్ కమిటీ సభ్యులకు, కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో అధికారి పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దళితులకు 3 ఎకరాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలు అమలుకు నోచుకోవడం విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొల్లరాముడు, బూత్ కమిటీ సభ్యులు, నాయకులు హాజరయ్యారు.

ఘనంగా విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



విఠలాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: మండలంలోని అడివిరావల్‌చేర్వులో వడిగిరి బసవన్న స్వామి ఆలయంలో నూతన విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠను ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు వేద పండితులు మాన మహోమం నిర్వహించి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అలాగే విఠలాపురంలో జమ్ములమ్మ, పరుషరాముడు విగ్రహాలను ఆలయంలో పూజలు చేసి ప్రతిష్ఠించారు. అడివిరావల్‌చేర్వులో క్రేన్ సహాయంతో భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనను భక్తిశ్రద్ధలతో చేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, నాయకులు విక్రంసింహరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, నరేందర్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



జల్లాపురంలో మెట్లపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్రహం

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెట్లపూజలో ఎమ్మెల్యే వీఎం అబ్రహం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకు ముందు చెన్నిపాడులో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. గ్రామంలో శివనామస్మరణ మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లికి పూజలు



పచ్చర్ల రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాజోళి: మండలంలోని పచ్చర్లలో ఆదివారం ఎల్లమ్మ ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పసుపు కుంకుమలు ఇవ్వగా, మరికొందరు బోనాలతో వచ్చి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగే సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్’తో మెరుగైన వైద్యం



చెన్నిపాడులో ఆయుష్మాన్ కార్డులు నమోదు చేస్తున్న ఆరోగ్యమిత్రలు, ఆశలు

మానవపాడు: ఆయుష్మాన్‌తో మెరుగైనా వైద్య సేవలు అందుతాయని ఆరోగ్యమిత్రలు రాజేంద్రప్రసాదు, వెంకటేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని చెన్నిపాడులో ఆయుష్మాన్ పథకం కోసం గ్రామస్తుల వివరాలను నమోదు చేసి కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుస్మాన్ పథకం ద్వారా ఏ రాష్ట్రంలోనైనా రూ. 5లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందుతాయన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ ఎంపిక చేసిన మీ సేవ కేంద్రాల ద్వారా లబ్ధిదారుల వివరాలు నమోదు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆశలు, వైద్య సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం అలంపూర్ మున్సిపాలిటీలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మధురవాణి, నరేష్, ఈశ్వరయ్య, శరత్, వెంకటేశ్వర్లు, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు

అమ్మా.. ఆశీర్వదించు

వైభవంగా రథోత్సవం

ఉండవెల్లి: అమ్మా ఎల్లమ్మ తల్లి రక్షించు అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆదివారం మండలంలోని కంచుపాడు రేణుక ఎల్లమ్మ ఆలయంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్ములమ్మ అమ్మవారిని, పరుశరాముడికి ప్రత్యేక పూజలు చేసి రథంపై ప్రతిష్ఠించారు. అమ్మా ఆశీర్వదించు అంటూ వేడుకున్నారు. మధ్యాహ్నం 1.45కు రథానికి ఎమ్మెల్యే అబ్రహం, రైతు సంఘం సభ్యులు, ఆలయ చైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రథాన్ని మేళతాళాలతో, పూల అలంకరణలతో, భక్త జన సంద్రంతో ఊరేగించారు. ధ్వజస్తంభం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే అబ్రహం, తనయుడు అజయ్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవన్న, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్ గౌడ్, రఘు రెడ్డి, రవి కుమార్, రామన్ గౌడ్, శంకర్, సర్పంచు శేషన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం



ధరూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ధరూరు: ఏసు బోధనలు అనుసరణీయమని రెవ పాస్టర్ నరేష్‌పాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బైబిల్ ప్రవచనాల ఆధారంగా బోధించారు. సర్వలోక సృష్టికర్త అయిన ఏసుక్రీస్తును పోలిన జీవితాన్ని కలిగి ఉండాలని అన్నారు. కల్మషం లేని జీవితాన్ని గడపాలని కోరారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సత్యన్న, సైదన్న, సీమోను, డేవిడ్, దానియేలు, ఎజ్రా, యోబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఘూర్లబీడు గ్రామానికి చెందిన వెంకటేష్, రాము వివిధ గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయచూర్‌కు బొలెరో వాహనంలో తరలిస్తున్నారు. మండలంలోని మల్లాపురం శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా అక్రమంగా రేషన్‌బియం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ వెంకటేష్, రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, పోలింగ్ బూత్ అధ్యక్షుల టీమ్‌లను ఏర్పాటు చేసుకుంటూ గ్రామాలలో వీధి మీటింగ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ భీమా యోజనా, ఆవాస్ యోజనా, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేకే రెడ్డి, నాగరాజు, అబ్దుల్లా, కిషోర్, అశోక్, రంజిత్ కుమార్, శారద, నీలమ్మ, నరేంద్ర, శేషు, యుగందర్, తదితరులు పాల్గొన్నారు.